క్లుప్తంగా

ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలి

మణుగూరురూరల్: రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లి చదువుకోలేని వారందరూ ఓపెన్ స్కూల్ విధానం ద్వారా ప్రభుత్వం చదువుకునే అవకాశం కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ఎంఈఓ వీరస్వామి, ఖమ్మం జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు మంగళవారం తెలిపారు. ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను కేవలం ఐదు సబ్జెక్టుల్లో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులందరూ తమ పాఠశాల పరిధి ప్రజలకు వివరించి చదువుకునేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు మల్లేశ్వరరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టుతో విద్యా సామర్థ్యాలు మెరుగు

బూర్గంపాడు: విద్యా సామర్థ్యాల పెంపొందించేందుకే విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తొలిమెట్టు కోర్సు డైరెక్టర్ తోటమళ్ల రమ అన్నారు. వారం రోజులుగా కొనసాగుతున్న తొలిమెట్టు శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. బూర్గంపాడు ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన వర్క్ బుక్స్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఇంగ్లిష్ రిసోర్స్ పర్సన్ గోవింద్, రమేష్ పాల్గొన్నారు.

కాలువ గండిని పరిశీలన

దుమ్ముగూడెం: భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువకు పడిన గండి ప్రాంతాన్ని జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాలిపేరు అధికారులతో మాట్లాడగా.. ఇంకొంచెం పనులు ఉన్నాయని కూలీలు అందుబాటులో లేక నిలిచిపోయాయని ఆమెకు వివరించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. వెంటనే అధికారులు మరమ్మత్తు పనులు పూర్తి చేసి నీళ్లు అందించాలని కోరారు. ఆమె వెంట వెంకన్నరాజు, మున్నా ఉన్నారు.

సన్నాహక సమావేశం

మణుగూరురూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఏరియా జీఎం కార్యాలయంలో అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఆగస్టు 15న జీఎం కార్యాలయ ప్రాంగణంలో, కమ్యూనిటీహాల్‌లో నిర్వహించబోయే స్వాతంత్ర్య వేడుకల్లో ఏర్పాట్ల గురించి సూచనలు చేశారు. ఏరియా ఎస్ఓటూ జీఎం ఈసం కృష్ణయ్య, ఏజీఎం (సివిల్) వెంకటేశ్వర్లు, డీజీఎంలు వెంకట్రావు, ఎస్.రమేష్, ఎస్ఈ(ఈఅండ్ఎం) శోభన్‌బాబు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శేషగిరిరావు, సీనియర్ పీఓలు ఎస్ శ్రీనివాస్, వి.రామేశ్వరరావు, సీనియర్ సెక్యూరిటి అధికారి షబ్బీరుద్దీన్ పాల్గొన్నారు.

ఇళ్ల కోసం ఆందోళన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మనుబోతుల చెరువు కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మిస్తున్న ప్రదేశంలో మహాజన మహిళ సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పట్టణంలోని అర్హులైన ఇళ్లు లేనివారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల లత, చిప్పనపల్లి సమత సమత, నిర్మలమ్మ, పార్వతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరనిలోటు

మణుగూరురూరల్: గద్దర్ లేని లోటు ఎవరూ తీర్చలేరని మణుగూరు ఏరియా కార్మిక సంఘాల నాయకులు అన్నారు. మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2లో మంగళవారం ప్రజా గాయకుడు ప్రజాయుద్ధనౌక గద్దర్ సంతాపసభను నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి ఉద్యోగులు రెండు నిముషాలు మౌనం పాటించి ఘన నివాళ్లు అర్పించారు. వి.ప్రభాకర్‌రావు, నాసర్‌పాషా, మేకల ఈశ్వర్, వి వెంకటరత్నం, బైరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి

ములకలపల్లి: సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి అన్నారు. పాతూరు, ఎర్రొడ్డు, మేడువాడు గ్రామాల్లో గత వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోడంతో, గ్రామస్తులు రాస్తారోకో చేసిన విషయం విధితమే. ఈనేపథ్యంలో మంగళవారం ఎంపీఓ లక్ష్మయ్య ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్‌లతో కలసి ఆయాగ్రామాల్లో జెడ్పీటీసీ క్షేత్రస్థాయిలో పర్యటించారు. వివరాలు తెలుకున్నారు. వెంటనే తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్థానిక సర్పంచ్ సున్నం సుశీల, పంచాయతీ కార్యదర్శి విక్రమ్, ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఎండి.అంజుం, బూరుగుపల్లి పద్మశ్రీ, కుంజా బుల్లెమ్మ, కుంజా రవి, సడియం చిలకమ్మ తదితరులున్నారు.

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు

- వేలల్లో వీధి కుక్కల సంచారం
- ఏడాదికాలంలో 1,771 కుక్కల దాడులు
- కుక్క కాటును నిర్లక్ష్యం చేయొద్దంటున్న వైద్యులు


కారును వెంబడిస్తున్న శునకాలు (ఫైల్)


పట్టణంలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో కుక్కల బెడత తీవ్రమైంది. ముఖ్యంగా రాత్రి పూట ఒంటరిగా వెళ్లే వారిపై, వాహనాల వెంట పడి దాడి చేస్తున్నాయి. ఇక వీధుల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రతిరోజూ పట్టణ పరిధిలో ఏదో ఒక కుక్కల బారిన పడుతున్నారు. అయితే కుక్క కాటుకు గురైన వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు. బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు వేయించుకోవాలని, రేబిస్ వ్యాధి సోకుతుందనే అపోహలను విడనాడాలని చెబుతున్నారు.

నియంత్రణ కాగితాల్లోనే..

వీధి కుక్కల జననాల నియంత్రణ కార్యక్రమాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాటి జనన నియంత్రణ పద్ధతులు పాటించడంతో పాటు రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని గతంలో నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. భద్రాచలం పట్టణంలో వీధి కుక్కలు 2000లకు పైగానే ఉండగా పెంపుడు కుక్కలు 1500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వీధి కుక్కల సంఖ్య నిత్యం పెరుగుతూ వస్తోం. వీటికి తప్పనిసరిగా మూడు నెలల వయస్సులో టీకాలతో పాటు ఏటా బూస్టర్ డోసు వేయించాలని, పెంపుడు కుక్కలకు కూడా విధిగా జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలి. వీధి కుక్కలకు మాత్రం భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో జనన నియంత్రణ కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. వీధి కుక్కలను పట్టడం పెద్ద సమస్యగా మారడం, వాటికి జనన నియంత్రణ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. అధికారులు వీటి నియంత్రణపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్క కాటును నిర్లక్ష్యం చేయొద్దు



కొంత మంది కుక్కలను చూసి కరుస్తాయన్న భయంతో పరిగెత్తుతారు. అది పద్ధతి కాదు. అలా చేస్తే కుక్కలు అనుమానించి మీదికి వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి భయం లేకుండా తన దారిన తాను పోతే కుక్కలు పట్టించుకోవు. పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ కుక్క కాటును నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, భద్రాచలం ఇన్‌చార్జ్ ఏడీపీ

వీధి కుక్కలను నియంత్రించాలి



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల వాటి సంచారం అధికమైంది. ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్తున్న సమయంలో మనుషుల పైకి ఎగబడుతున్నాయి. వాటిని చూస్తూ వీధుల్లో తిరగాలంటే భయమేస్తోంది. చిన్నారులను చూస్తూనే మీద పడి దాడి చేస్తున్నాయి. వీధి కుక్కలను నియంత్రించాలని పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయింది.

– శ్రీధీరాల వెంకటాచారి, మెడికల్ కాలనీ, భద్రాచలం

వ్యాక్సినేషన్ ప్రక్రియను చేపడతాం



పట్టణంలో వీధి కుక్కల బెడద అధికంగానే ఉంది. వీటిపై నిత్యం సంబంధిత కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు సమాచారం వస్తుంది. ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరగా వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా వీధి కుక్కలు ఉన్న పరిసరాల్లో తగు జాగ్రత్తలు తీసుకుని వారి కార్యక్రమాలు నిర్వహించుకోవాలి.

– వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, భద్రాచలం

ఆదివాసీలు పావులు కావొద్దు


భద్రాచలంఅర్బన్: మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: మాదక ద్రవ్యాల మాఫియాకు ఆదివాసీలు పావులు కావద్దని భద్రాచలం జూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భద్రాచలం జుడుసియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనుసూచిత ప్రాంతాల్లోని ఆదివాసీలతో గంజాయి సాగు యథేచ్ఛగా కొనసాగుతుండగా.. వాటి రవాణాకు ఆదివాసీలను సాధనంగా ఉపయోగించుకుంటున్నారని, అటువంటి మాఫియా ముఠాలకు ఆదివాసీలు ఉపయోగపడొద్దని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, ఏపీపీ సాంబ దుర్గాబాయి, లీగల్ కౌన్సిల్స్ ఎం.రమా, శారదా రెడ్డి, బార్ అసోసియేషన్ సాంస్కృతిక కార్యదర్శి కామరాజు తిరుమలరావు, కోశాధికారి సాధన పల్లి సతీష్, మాజీ అధ్యక్షుడు రేవూరు జయరాజు, సీనియర్ న్యాయవాది ఎంవి.ప్రసాదావు, పట్టణ సీఐ నాగరాజు రెడ్డి, ఆదివాసీ న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చీమల నరసింహారావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని డి.కొత్తగూడెం, నందులచెలక,దర్మవరం, నడికుడి గ్రామాల్లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జెండా ఆవిష్కరణలు చేశారు. జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 76 వసంతాలు గడుస్తున్నప్పటికి నేటికీ ఆదివాసీలు అభివృద్ధికి అమడదూరంలోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సోయం బాలకృష్ణ కృష్ణమూర్తి, వర్ష సీతమ్మ, కురసం రామిశెట్టి, గుర్రం దుర్గారావు, పోచం రామకృష్ణ, కారం బజారు, తెల్లం వెంకటస్వామి, తెల్లం భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చండ్రుగొండ: దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు కోరారు. మండలకేంద్రం చండ్రుగొండలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని భవితకేంద్రంలో దివ్యాంగులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంపును మంగళవారం ఆయన సందర్శించారు. కేంద్రం నిర్వహన తీరుతెన్నులను ఆయన పరిశీలించారు. దివ్యాంగ పిల్లలకు అందుతున్న సేవలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లలు జిల్లాలో 1,807 మంది ఉన్నారని, అందులో 1,216 మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని చెప్పారు. సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్ల ద్వారా 212 మంది పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని, 154 మంది పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. అవసరమైన పిల్లలకు త్వరలోనే శిబిరాలు ఏర్పాటు చేసి ఉపకరణాలు, పనిముట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మోనిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ కిశోర్‌బాబు, ఎంఈఓ సత్తెనపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


అశ్వారావుపేటరూరల్: వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

అశ్వారావుపేటరూరల్: మలేరియా ప్రభావిత గిరిజన గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. మండలంలోని మొద్దులమాడ, రాళ్లవాగు, గోత్తియలగూడెంలో వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించగా.. వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ 54 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. వారిలో ఎనిమిది మంది జ్వరాల బారని పడినట్లు గుర్తించగా.. అందులో ఒకరికి మాలేరియా నిర్ధారణ అయినట్లు తెలిపారు. అనంతరం గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, దోమ తెరల వినియోగంపై అవగాహన కల్పించారు. శిబిరాల్లో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ రాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, ఏఎన్ఎం చెల్లమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలైన బుగ్గ, ఖమ్మంతోగు, బుడుగులలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆయా గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రత, ఇతర చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఎస్‌యూఓ లింగ్యానాయక్, సూపర్‌వైజర్ పుష్పారాణి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, కౌసల్య, రామలక్ష్మి, రాధ, ఎంఎల్‌హెచ్‌పీ భవాని తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పినపాక: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలిపారు. ఓటు హక్కు కలిగిన వారు మార్పులు చేర్పులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. అధికారులు సర్వే చేసి మరణించిన, వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి వివరాలు నమోదు చేసుకుని వారి ఓటు హక్కును రద్దు చేస్తామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ

చర్ల: చర్ల తహసీల్దార్‌గా రంగు రమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు చర్లలో ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా కొనసాగిన బి.భరణిబాబు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

వసతులు కల్పించాలి

బూర్గంపాడు: ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత కోరారు. మంగళవారం ఐటీడీఏ పీఓను కలసి ఏజెన్సీ గ్రామాల్లో సమస్యలను వివరించారు. పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంజనాపురం సర్పంచ్ భూక్యా భారతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలో కూనవరం రైల్వేగేట్ నుంచి బొంబాయికాలనీ వరకు గుంతలమయంగా మారిన రోడ్డుకు సర్పంచ్ ఏనిక ప్రసాద్ గ్రావెల్‌తో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషితో మంజూరైన రూ.9 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బొంబాయికాలనీ గాంధీబొమ్మ సెంటర్ వరకు డబుల్ రోడ్డును, సైడ్ డ్రెయిన్ పనులు పూర్తి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వల్లభనేని రమణ, మడి వీరన్నబాబు, బర్ల సురేష్, వార్డ్ సభ్యులు వంక సూరయ్య, వంక అర్జున్‌రావు, గుర్రం వినోద్, పూనెం నాగేంద్రబాబు, యేసు, రమ్య, కాంత్, పంచాయితీకార్మికులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యువజనోత్సవం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో వైద్య ఆరోగ్య శాఖ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాస్థాయి రెడ్ రిబ్బన్ 5కె రన్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ చంద్ర ప్రసాద్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో అయన మాట్లాడుతూ.. యువత చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సత్యకుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రాం అధికారి ఆనందబాబు, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు

అశ్వారావుపేటరూరల్: రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలు సమన్వయంతో పని చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియపై అన్ని మండలాల తహసీల్దార్లు, బీఎల్‌వోలు, స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరో రెండు నెలల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బీఎల్‌ఓలను నియమించుకోవాలని అన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసే ఎన్నికల స్ట్రాంగ్ రూంను పరిశీలించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక డీటీ సుచిత్ర, ఎన్నికల డీటీ వీరభద్ర నాయక్, తహసీల్దార్లు ముజాహిద్దీన్, జగదీశ్వర్ ప్రసాద్, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి నెట్‌వర్క్: గృహనిర్మాణం కోసం ప్రభుత్వం సాయం అందనున్న గృహలక్ష్మి పథకానికి మండల అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సొంత జాగా ఉండి ఇల్లు లేనివారు దరఖాస్తుకు అర్హులు. ఆ జాగా సంబంధిత కుటుంబంలోని మహిళ పేరు మీద ఉండాలి. ఒకవేళ ఇంట్లో మహిళలెవరూ లేకుంటే పురుషుల పేరుమీద ఉండొచ్చు. దరఖాస్తు ఫారానికి ఆధార్, రేషన్‌కార్డుల నఖలు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఇంటి స్థలం దస్తావేజులు, బ్యాంక్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌ఫొటోలను జత చేయాల్సి ఉంటుంది. దివ్యాంగులు అయితే అదనంగా సదరం సర్టిఫికెట్ కూడా పొందుపరచాలి. వీటిని ఆయా తహసీల్దార్ లేదా ఎంపీడీఓ కార్యాలయాల్లో రేపటిలోగా (ఆగస్టు 10) అందజేయాల్సి ఉంటుంది. ఈ మేరకు పినపాక తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, భద్రాచలం మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, మణుగూరు ఎంపీడీఓ చంద్రమౌళి, దుమ్ముగూడెం ఎంపీడీఓ ముత్యాలరావు, అన్నపురెడ్డిపల్లి ఎంపీడీఓ అన్నపూర్ణలు మంగళవారం వేర్వేరు ప్రకటనలలో వివరాలు వెల్లడించారు. కాగా, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు ప్రస్తుతం అందుబాటులో లేకపోతే.. ముందుగా 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకుని పత్రాల పరిశీలన సమయానికి ఆ ధ్రువపత్రాలు అందజేయాలని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి..

దుమ్ముగూడెం: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలని సీపీఎం భద్రాచలం నియోజవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ములకపాడు గ్రామంలోని యలమంచి సీతారామయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మికి ఇచ్చిన చివరితేదీ వ్యవధిలోపు దరఖాస్తుదారులు ఆదాయ, కులం సర్టిఫికెట్‌లు ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. గడువు పొడిగించకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్, జిల్లా నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, మండల నాయకులు కొమరం చంటి, మడకం మహేంద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని తెలంగాణ రాష్ట్ర గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం విధించిన గడువులోగా లబ్ధిదారులు పూర్తి స్థాయిలో దరఖాస్తులో పేర్కొన్న అర్హత ధ్రువీకరణ పత్రాలను అందజేయలేరని తెలిపారు.

ప్రజల్లో అయోమయం..

భద్రాచలంఅర్బన్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు విషయంలో ప్రజల్లో అయోమయం నెలకొందని భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరెళ్ల నరేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు కులం, నివాస ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలంటే 15 రోజుల వ్యవధి పడుతుందని, కానీ 10వ తేదీతో గడువు ముగుస్తోందని అన్నారు. తక్షణమే పథకానికి సంబంధించిన జీవో పత్రాలను విడుదల చేసి, దరఖాస్తు తేదీని ఈ నెలాఖరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎల్లో డే


ఎల్లో డేలో పాల్గొన్న యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ఎస్ఆర్ఎస్ కాలనీలోని సెయింట్ పాల్స్ పాఠశాల ఆవరణలో సెయింట్ పాల్స్ రేయాన్ కిడ్స్ వరల్డ్ ఆధ్వర్యంలో ఎల్లో డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అబ్రహం ఎల్లో కలర్ ప్రాధాన్యత, ప్రముఖ్యతను వివరించారు. పాఠశాల చైర్మన్ రాధా మంజరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

బూర్గంపాడు: సోంపల్లి గ్రామానికి చెందిన జ్వర బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలను అందించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు బట్టా విజయ్‌గాంధీ కోరారు. పాల్వంచ పీహెచ్‌సీలో చికిత్సలు పొందుతున్న బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు. సోంపల్లి గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని, గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు. జ్వరపీడితులకు బ్రెడ్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి వీరాంజనేయులు, ఉపసర్పంచ్ పెంకే సంతోష్ పాల్గొన్నారు.

రద్దు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజన్సీలో బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై చర్యలు తీసుకుని, ఆ పత్రాలను రద్దు చేయాలని భద్రాచలం పట్టణానికి చెందిన న్యాయవాది గద్దం రాము డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణం రాజుపేటకు చెందిన ఓ యువతి తప్పుడు కుల దృవీకరణ పత్రాలతో ఏపీలో ఉద్యోగం చేస్తున్నట్లు ఆయన ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వివరాలను మంగళవారం హరిత హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సంబంధిత అధికారులు స్పందించి బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

‘సఖి’ ములకలపల్లి కార్యదర్శిగా రమాదేవి



గుర్తింపు కార్డు అందుకుంటున్న రమాదేవి..

కొత్తగూడెంటౌన్: సఖి ఉమెన్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ ములకలపల్లి మండల కార్యదర్శిగా రమాదేవి నియమితులయ్యారు. మంగళవారం ఆమెకు కొత్తగూడెంలో ఫౌండేషన్ బాధ్యులు బోర్ర జయమ్మ, చింతల స్పందన నియామక ఉత్తర్వులు అందజేశారు. సుష్మ, మహ్మద్ సల్మా, బాలిశెట్టి సత్యభామ, జోగు కల్యాణి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


మణుగూరురూరల్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: 2003లో నియాకమైన వారికి తక్షణమే ఓపీఎస్ ఉత్తర్వులు ఇస్తూ సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారంపూడి దశంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం తమ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మణిధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఏజెన్సీ నిబంధనలకు భంగం కలుగకండా ఉపాధ్యాయులకు నివాస స్థలాలు నామ మాత్రపు రుసుముతో కేటాయించాలని, 1 జూలై 2023 నుంచి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయు మండల అధ్యక్షా, ప్రధాన కార్యదర్శులు వరప్రసాద్, హేస్టింగ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం భోజన విరామ సమయంలో తహసీల్‌లో ఆందోళన చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇళ్ల ప్లాట్లు కేటాయించాలని, పీఆర్‌సీ, ఐఆర్, ఇతర సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు కె.వెంకటేశ్వర్లు, మండల శాఖ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి మంగయ్య పాల్గొన్నారు.

12న ఆందోళనలు..

మణుగూరురూరల్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ర్యాలీలు, ధర్నాలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీరాహుస్సేన్ పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆందోళన కార్యక్రమాల వాల్ పోస్టర్లను వృత్యాంతర శిక్షణ కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ వీరస్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మీరాహుస్సేన్ మాట్లాడారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు, యూటీఎఫ్ నాయకులు వెంకన్న, ఎస్ రాంబాబు, కుమారస్వామి, కృష్ణమూర్తి, స్వరూపారాణి, పూజిత పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416